www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

మంగళవారం 2 - 9 - 2025 | సంపుటి : 1 | సంచిక : 55 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్



V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD

## ప్రభుత్వం సహకరిస్తే ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కోర్టుకు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం




విశ్వంభర, హైదరాబాద్: నిర్మల్ పురపాలక గడువు మార్చితో ముగిసినా ఎన్నికలు నిర్వహించట్లేదంటూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. వార్డుల విభజన పూర్తి చేసి ప్రభుత్వం సహకారం అందిస్తే ఎన్నికలు నిర్వహించడా నికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ప్రభుత్వం నిర్ణయం చెప్పడానికి గడువు కావాలని ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. ఇరు వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# 'ఓట్ల చోరీ'పై హైడ్రోజన్ బాంబు పేలుస్తాం



2లో...

దీని తర్వాత ప్రధాని మోడీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారు
రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బీజేపీని అనుమతించబోం
'ఓటర్ అధికార్ యాత్ర'కు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది
ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



2లో...

## అనుమతుల పేరుతో వేధింపులు తగదు...

ఎన్‌వోసీల జారీలో అలసత్వంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం
ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అనుమతులు ఇవ్వాలని ఆదేశం




## బీఆర్ఎస్ పని అయిపోయినట్లే...

- కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే హరీశ్‌రావు ఊరుకోరు
- పార్టీనేతలు కొందరు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి కేసీఆర్‌ను కలిశారు
- ఈ విషయంపై రేపు ఆలోచిద్దామని ఆయన అన్నారట...
- ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి

2లో...

## ఈసీ, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు దురదృష్టకరం



2లో...

- ప్రత్యేక సమగ్ర సవరణపై జరిగిన విచారణలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- ఫిర్యాదుల విషయంలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేయాలి - బిహార్ లీగల్ సర్వే అథారిటీకి ఆదేశాలు...

## ఉపరాష్ట్రపతి పదవి.. రాజకీయ పదవి కాదు

- ఆ బాధ్యత మోయగలుగుతానా? అనే సందిగ్ధావస్థలో ఉన్నాను
- భారత సంవిధానంతో 53 ఏళ్లుగా తన ప్రయాణం కొనసాగుతోంది
- నాకు ఏ పార్టీలో సభ్యత్వం లేదు.. ఇకపై ఏ పార్టీ సభ్యత్వం తీసుకోను..
- దేశ పౌరుడిగా క్రమం తప్పకుండా ఎన్నికల్లో పాల్గొంటాను : జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



2లో...

## కేసీఆర్‌కు అవినీతి మరక వెనుక హరీశ్‌రావు పాత్రలేదా?

- పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు
- కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు రాద్ధాంతం చేస్తున్నారు
- కేసీఆర్ జనం కోసం పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు
- హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు
- ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా - కవిత సంచలన వ్యాఖ్యలు



2లో...

## ఎవరైతే మోసం చేయగలరో.. వారే గొప్ప లీడర్లు

- రాజకీయాల్లో నిజం మాట్లాడటం నిషేధం
- నిజాయతీ, అంకితభావంతో జీవించాలి
- సత్వర ఫలితాల కోసం అడ్డదారులు ఎంచుకోవద్దు
- దీర్ఘకాలిక విజయం ఎప్పుడూ నిజంపై ఆధారపడి ఉంటుంది
- అంతిమంగా నిజమే గెలుస్తుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు
- హాట్ టాపిక్‌గా కేంద్ర మంత్రి గడ్కరీ వ్యాఖ్యలు



2లో...



## చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలి

- మోడీకి లేఖ రాయండి..
- మోహన్ భగవత్ కు బొల్ల శివశంకర్ లేఖ

2లో...

# వర్షనష్టంపై సమగ్ర నివేదికలు రూపొందించాలి



- రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలి మరమ్మతు, పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి.
- ఈనివేదికతో ఢిల్లీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బృందం
- మృతుల కుటుంబాలకు, పశువులు
- కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం విడుదల తీవ్రంగా నష్టపోయిన జిల్లాల
- కలెక్టర్లకు తక్షణ ఉపశమనం కింద రూ.10 కోట్లు
- గతేడాది వరద పరిహారం.. ఇతర వివరాలపై ఆరా
- విపత్తుల సమయంలో కలెక్టర్లు, ఎస్పీలు తక్షణమే రంగంలోకి దిగాలి
- వరదలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- నీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణపై నివేదికకు ఆదేశం...

2లో...



2లో...

## గిన్నిస్ బుక్ రికార్డ్స్ లక్ష్యంగా బతుకమ్మ వేడుకలు

- ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో ప్రారంభం - మహిళా స్వయం సహాయక సంఘాలతో
- ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులంతా పాల్గొనేలా వేడుకలుంటాయి
- మంత్రి జూపల్లి కృష్ణారావు

## సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

- ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలి
- ఓపిఎస్‌ను అమలు చేస్తే సీఎం చరిత్రలో నిలుస్తారు
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

2లో...

## కిమ్స్ కడల్స్ వైద్యుల ఘనత..

- నవజాత శిశువును 1300కి.మీ అంబులెన్స్‌లో తీసుకొచ్చి చికిత్స
- ఈ ప్రయత్నంలో మొత్తం 31 మంది సిబ్బంది పాల్గొన్నారు
- శిశువు పూర్తిగా కోలుకున్నారు
- ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బాబు ఎస్. మాదర్కర్

2లో...

# 'ఓట్ల చోరీ'పై హైడ్రోజన్ బాంబు పేలుస్తాం

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర,నేషనల్ బ్యూరో:** ఓట్ల చోరీ విషయంలో ఇటీవల అణుబాంబు పేల్చామని.. త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీని తర్వాత ప్రధాని మోడీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారన్నారు. 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ ఈమేరకు ప్రసంగించారు."రాజ్యాంగాన్ని దెబ్బ తీసేందుకు బీజేపీకు అనుమతించబోం. అందుకే ఈ యాత్ర నిర్వహించాం. దీనికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మహారాష్ట్రలో, కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగిందని ఆధారాలు సహా చూపించాం. ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే. ఈ వ్యవహారంలో త్వరలోనే హైడ్రోజన్ బాంబు పేల్చనున్నాం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'ఓటరు అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా 'ఇండియా' కూటమి నేతలు పట్నాలో నిర్వహించిన 'గాంధీ సే అంబేద్కర్' మార్చ్‌ను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే ప్రసంగించారు.

**రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ..**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు తనను తాను కించపరచుకోవడమే కాకుండా ఓటర్లను అవమానించేలా ఉన్నాయని భాజపా మండిపడింది. "రాహుల్ గాంధీఎక్కడ మాట్లాడినా.. ఆయన ఏం చెప్పాలనుకుంటున్నారో అర్థం చేసుకునేందుకు సమయం పడుతుంది. ఇప్పుడు అణుబాంబు, హైడ్రోజన్‌బాంబు అంటున్నారు. అసలు ఎన్నికలకు వీటికి ఏంసంబంధం? ఆయన బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు" అని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

# అనుమతుల పేరుతో వేధింపులు తగదు...

మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర,హైదరాబాద్:** బహుళ అంతస్తుల భవనాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి అనుమతుల జారీ విషయంలో జాప్యంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎండీఏ పరిధిలో బిల్డ్ నౌ కింద పనుల అనుమతుల విషయంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం సమీక్షించారు. బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణం, ఇతర అనుమతుల విషయంలో ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులు అలసత్వం చూపుతున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అనుమతుల జాప్యంలో ఆలస్యానికి కారకులను గుర్తించి వారిని సరెండర్ చేయాలని హెచ్ఎండీఏ కార్యదర్శి ఇలంబర్తిని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా నీటి పారుదల శాఖ విభాగం అధికారులపై పలు ఆరోపణలు వస్తున్నాయని.. వాటిని ఎంతమాత్రం సహించేది లేదని సీఎం హెచ్చరించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులు, నాలాల, ఇతర నీటి వనరులకు సంబంధించి లైడార్ సర్వేను తక్షణమే చేపట్టాలని సీఎం ఆదేశించారు. సమగ్రమైన వివరాలున్నప్పుడు మాత్రమే ఎటువంటి వివాదాలకు తావుండదని సీఎం అన్నారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం హెచ్‌ఎండీఏ సెక్రటరీని ఆదేశించారు. సమీక్షలో హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపరాష్ట్రపతి పదవి.. రాజకీయ పదవి కాదు

**విశ్వంభర, హైదరాబాద్:** ఉపరాష్ట్రపతి పదవి.. రాజకీయ పదవి కాదని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత సంవిధానంతో 53 ఏళ్లుగా తన ప్రయాణం కొనసాగుతోందన్నారు.''ఉపరాష్ట్రపతి బాధ్యత మోయగలుగుతానా? అనే సందిగ్ధావస్థలో ఉన్నాను. రాజకీయ ముళ్ల కిరీటాన్ని నెత్తిన పెట్టుంకుంటున్నారేంటని చాలా మంది అడిగారు. న్యాయశాస్త్ర పెనుబంధాన్ని ఎందుకు వీడుతున్నారని ప్రశ్నించారు.

నా ప్రయాణంలో ఎలాంటి బ్రేక్ లేదు.. కొనసాగింపే ఉంది. అందుకే నేను రాజకీయాల్లో ప్రవేశించలేదు. నాకు ఏ పార్టీలో సభ్యత్వం లేదు.




ఇకపైఏపార్టీ సభ్యత్వం తీసుకోను. దేశ పౌరుడిగా క్రమం తప్పకుండా ఎన్నికల్లో పాల్గొంటాను. పౌర సమాజం ప్రతినిధిగా పౌర హక్కులు, సామాజిక న్యాయం, వివిధ సమస్యలపై మాట్లాడతాను. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు అమలు చేసే ప్రభుత్వాల సిద్ధాంతాలకు చెందిన వ్యక్తిని. ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశిక సూత్రాలు అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వనరుల సంపద ఎవరి చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ప్రణాళికలు రచించాలి"అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అనంతరం మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు అవినీతి మరక వెనుక హరీశ్‌రావు పాత్రలేదా?

## కవిత సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర,హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా? అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. " కేసీఆర్‌జనం కోసం పని చేస్తే..వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు.హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈరోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు,సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్‌రెడ్డి



ఏమీఅనరు.నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నాలేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయట పెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ-ప్లాన్‌డ్‌గా సీబీఐ పేరు చెప్పారు.

# ఎవరైతే మోసం చేయగలరో.. వారే గొప్ప లీడర్లు

## హాట్ టాపిక్‌గా కేంద్ర మంత్రి గడ్కరీ వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర,నేషనల్ బ్యూరో:** తన మనసులో ఉన్న విషయాలను కుండబద్దలు కొట్టినట్లు బహిరంగంగా చెప్పేస్తుంటారు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ.రాజకీయ నాయకులపై ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలు మరోసారి హాట్‌టాపిక్‌గా నిలిచాయి. నాగ్‌పుర్‌లో సోమవారం అఖిల భారత మహానుభావ పరిషత్తు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ పలు అంశాలపై నిర్మొహమాటంగా మాట్లాడారు. నిజాయతీ, అంకితభావంతో జీవించాలని, సత్వర ఫలితాల కోసం అడ్డదారులు ఎంచుకోవద్దని ప్రజలకు సూచించారు. 'ఏది సాధించాలనుకున్నా ఓ షార్ట్‌కట్ ఉంటుంది.దాంతో త్వరగాగమ్యాన్ని చేరుకోవచ్చు. ఉదాహరణకు రహదారి నిబంధనలను ఉల్లంఘించి రోడ్డు దాటొచ్చు. కానీ, షార్ట్‌కట్ వాడారంటే అది మిమ్మల్ని షార్ట్‌గా కట్ చేసేస్తుంది. అందుకే మనసమాజంలో నిజాయతీ, విశ్వసనీయత, అంకితభావం, నిజం అనే విలువలు ఉన్నాయి. దీర్ఘకాలిక విజయం ఎప్పుడూ నిజంపై ఆధారపడి ఉంటుంది. అంతిమంగా నిజమే గెలుస్తుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు' అని గడ్కరీ పేర్కొన్నారు. తన దైనందిన జీవితంలో(రాజకీయాల్లో) నిజం మాట్లాడటం నిషేధమని వ్యాఖ్యానించారు. 'నేను పనిచేసే రంగంలో మనస్ఫూర్తిగా మాట్లాడటం నిషేధం. ఎవరైతే ప్రజలను మోసంచేస్తారో వారే గొప్ప నాయకులు'అంటూ తనదైన శైలిలో చమత్కరించారు.ఇటీవల గడ్కరీ మాట్లాడుతూ కోర్టు కేసుల వల్ల ప్రభుత్వం క్రమశిక్షణతో పనిచేస్తుందని, పరిపాలన అద్భుతంగా జరుగుతుందని వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయించే వారి కారణంగా రాజకీయ నాయకుల్లో క్రమశిక్షణ పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రులు చేయలేని పనులను న్యాయస్థానాలు చేయిస్తాయన్నారు. ఏపార్టీ అధికారంలో ఉన్నా మంచి పనులు చేసే నేతలకు గౌరవం దక్కదని, చెడు పనులు చేసేవారికి శిక్షలు ఉండవని గతంలో గడ్కరీ చేసిన వ్యాఖ్యలు సైతం వైరలైన విషయం తెలిసిందే.

# చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలి

## మోడీకి లేఖ రాయండి..

## మోహన్ భగవత్ కు బొల్ల శివశంకర్ లేఖ

మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** చేనేత వస్త్ర పరిశ్రమను రక్షించడానికి, దానిపై విధించిన జీఎస్టీని రద్దు చేయమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాయాలని మోహన్ భగవత్, ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ కు కోరుతూ బొల్ల శివశంకర్ లేఖ వ్రాసారు. మన చేనేత వస్త్ర పరిశ్రమకు నేడు ఒక పెద్ద సమస్య ఎదురైంది. చేనేత వస్త్రాలు మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, స్వాతంత్ర్య పోరాటానికి చిహ్నం. మన హిందూ సంస్కృతిలోనూ చేనేత వస్త్రాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఒక దేశ వారసత్వాన్ని, దాని సంస్కృతిని కాపాడటం మన అందరి కర్తవ్యం. అయితే, చేనేత పరిశ్రమకు ముఖ్యమైన దారంపై విధించిన జీఎస్టీ పన్ను కారణంగా చేనేత కార్మికుల జీవితాలు కష్టాల పాలయ్యాయి. ఈ పన్ను భారం వల్ల వస్త్రాల ధరలు పెరిగి,
కార్మికుల ఆదాయం పడి పోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఈ వృత్తి మీద ఆధారపడిన వేలాది కుటుంబాలు వీధిన పడతాయి. అఖిల భారత పద్మశాలి రాజకీయ అధ్యక్షుడిగా, మరియు చేనేత/నేతన్న యాత్ర ఇన్‌చార్జ్‌గా బొల్ల శివ శంకర్ అనే నేను ఈ సమస్యను దగ్గరగా చూస్తున్నాను. అందువల్ల, మీ సహా యం కోసం మేము ఎదురు చూస్తున్నాం. మన పద్మశాలి సమాజం తరపున, చేనేత కార్మికులందరి తరపున మిమ్మల్ని మనసారా వేడుకుంటున్నాను. మీరు ఈ సమస్యపై జోక్యం చేసుకుని, చేనేత వస్త్రాలు మరియు దా రంపై ఉన్న జీఎస్టీ ని పూర్తిగా రద్దు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ మోహన్ భగవత్ రాయాలని కోరుకుంటున్నాను. మీరు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటారని మరియు మా చేనేత సోదరుల జీవితాలను రక్షించడంలో సహాయపడతారని ఆశిస్తున్నాను.



# వర్షనష్టంపై సమగ్ర నివేదికలు రూపొందించాలి

మొదటి పేజీ తరువాయి...

విశ్వంభర, హైదరాబాద్: ఇటీవల భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (ఎస్డీఆర్ఎఫ్) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్రం నుంచి సరైన సహాయం అందకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. గతంలో కేంద్రం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం... గతేడాదికి సంబంధించి రావల్సిన నిధులు.. ప్రస్తుతం వ్యవసాయ, పశు సంవర్ధక, నీటిపారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్య, విద్యుత్ శాఖల పరిధిలో వాటిల్లిన నష్టంపై సమగ్ర నివేదికలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ రెండు నివేదికలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల నాలుగో తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి అందజేస్తుందని సీఎం తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయం లో సోమవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వరదలతో రాష్ట్రవ్యా ప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడిందని అధికారులు ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్ఆర్ఆర్, ప్రధానమం త్రి క్రిషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సీఎం సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవని సీఎం గుర్తు చేశారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసిప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. నివేదికపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు.తమ ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని సీఎం తెలిపారు. నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు సీఎం ఆదేశించారు. పురపాలక, పంచాయతీరాజ్, జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధి దీపాల నిర్వహణ, ఏర్పాటుపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం సూచించారు. చెంగిచర్లతో పాటు జియాగుడ, అంబర్ పేటలోని స్లాటర్ హౌస్‌ల్లో హలాల్, జట్కా సక్రమంగా జరిగేలా చూడాలని.. అధునాతన యంత్రాలు వాడేలా చూడాలని.. అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని, మాంసం విక్రేతలు అన్ని నిబంధనలు పాటించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు సమగ్ర నివేదికలు రూపొందించి రెండు రోజుల్లో అందజేయాలని సీఎం ఆదేశించారు.రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నూతన వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, ఆసుపత్రుల భవనాల పనులు వేగవంతం చేయడంతో పాటు వాటి ప్రారంభానికి తేదీలు నిర్ణయించాలని ఆ శాఖ కార్యదర్శి క్రిసియానా జోంగ్తూని సీఎం ఆదేశించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో సీఎం మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక పనులు వేగవంతం చేయాలని, పరిహారాలు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు ఎస్డీఆర్ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు సకాలంలో వినియోగితా పత్రాలు (యూసీ) సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపత్తు సమయాల్లో స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ దళాలు వరదల సమయంలో మెరుగైన సేవలు అందించడంపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

# ఈసీ, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు దురదృష్టకరం

మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణపై జరిగిన విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ జాబితా ముసాయిదాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు సెప్టెంబర్ ఒకటి డెడ్‌లైన్‌ను పొడిగించాలంటూ దాఖలైన పిటిషన్లను విచారించింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఫిర్యాదుల విషయంలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేయాలని బిహార్ లీగల్ సర్వే అథారిటీకి ఆదేశాలు ఇచ్చింది. సెప్టెంబర్ 30 తర్వాత కూడా అభ్యంతరాలను స్వీకరిస్తామని, నామినేషన్ల దాఖలు చివరి తేదీ వరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీంకు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇదే విషయాన్ని కోర్టు పిటిషనర్ల వద్ద ప్రస్తావించింది. కాగా.. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ముసాయిదా జాబితాను ఆగస్టు 1న ఈసీ విడుదల చేసింది. దీనిని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేయడంతోపాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ అంశంపైనే తాజా విచారణ జరిగింది. ముసాయిదా జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఈసీ తొలగించిన సంగతి తెలిసిందే. మరోవైపు పౌరసత్వంపై అనుమానాలున్న 3లక్షల మందికి నోటీసులు పంపించినట్లు తెలిపింది.

# సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి




మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** ఉద్యోగులకు పెన్షన్ బిక్ష కాదని, అది కనీస హక్కుని, కాంట్రిబ్యూషన్ పెన్షన్ ఉద్యోగులకు శాపంగా మారిందని, ప్రభుత్వం వెంటనే సిపిఎస్ ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం ఓపిఎస్ ను పునరుద్ధరించి ఉద్యోగుల ఆత్మగౌరాన్ని కాపాడాలని తెలంగాణ ఉద్యోగులజేఏసీ చైర్మన్ వి లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సంపూర్ణ మద్దతుతో తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధనకై సిపిఎస్ ఉద్యోగులు ఉద్యోగ, ఉపాధ్యాయ ఆత్మ గౌరవ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్యలు, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు అశ్వద్ధామ రెడ్డి, జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి లు, హాజరై మాట్లాడారు. సిపిఎస్ ఉద్యోగులకు ఇదే చివరి విద్రోహ దినం కావాలని ఆకాంక్షించారు. కొత్త పెన్షన్ పథకం కింద రిటైర్ అయిన ఉద్యోగులకి 1000, 2000 రూ. మించి పెన్షన్ రాదని, ఇది నష్టం కలిగించే అంశమని, కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఉద్యోగులకు శాపంగా మారిందని, అనేక క్లిష్ట సమస్యలను పరిష్కరిస్తున్న సీఎం, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడని ఓ పి ఎస్ ను అమలు చేస్తే సీఎం చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని అన్నారు. రెవెన్యూ శాఖకు మళ్లీ పూర్వ వైభవం తీసుకు వచ్చినట్లుగానే సిపిఎస్ ఉద్యోగులకు మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. పదవి విరమణ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ఎలాంటి షరతులు లేకుండా కుటుంబ పెన్షన్ ఇవ్వాలని కోరారు. సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ విధానం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో నేటికీ పాత పెన్షన్ విధానమే కొనసాగుతుందని హిమాచల్ ప్రదేశ్ రాజస్థాన్ ఛత్తీస్గడ్ జార?ండ్ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానంలో అమలు చేస్తున్నారని, వీటిని దృష్టిలో ఉంచుకుని మానవ దృక్పథంతో ఆలోచించి ఓ పి ఎస్ ని అమలు చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరాం, మల్కా కొమరయ్యలు మాట్లాడుతూ..పెన్షన్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని, ఇటీవల సుప్రీంకోర్టు తన తీర్పులో వెల్లడించిందని, గౌరవప్రదంగా జీవించే హక్కులో భాగమే పెన్షన్ అని ఇందులో ఫిక్స్ పెన్షన్, ఫిక్స్ పేమెంట్ వంటి మౌలిక తేడాలున్నాయని, గతంలో చీఫ్ సెక్రటరీకి నివేదిక సమర్పించడం జరిగిందని, సి పి ఎస్ ఉద్యమానికి తమ వంతు మద్దతు లభిస్తుందని తెలిపారు. ఓపిఎస్ కోసం ప్రభుత్వాన్ని ఒపిద్దామని లేదంటే సిపిఎస్ రద్దు కోసం పోరాడదామన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కో చైర్మన్ రామకృష్ణ,నాగవల్లి, ఉపేందర్, రాములు, రాధా, కృష్ణారావు, మైపాల్ రెడ్డి, మంగ, నరసింహులు, లింగం, శ్రీను, తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్ కడల్స్ వైద్యుల ఘనత..

మొదటి పేజీ తరువాయి...

**విశ్వంభర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యులు అద్భుత ఘనత సాధించారు. నవజాత శిశువును గుజరాత్‌లోని సూరత్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. గుజరాత్‌లోని సూరత్ నగరంలో నివాసం ఉంటున్న ఓ తెలుగు కుటుంబంలో నెలలు నిండకముందే శిశువు పుట్టింది.

అయితే, తీవ్ర అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో పలు అవయవాలు పని చేయడం మానేశాయి. అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. దీంతో చిన్నారి తండ్రి సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిని సంప్రదించారు. ఎయిర్ అంబులెన్స్‌లో తీసుకొద్దామని ప్రయత్నిం చినా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రోడ్డు మార్గంలో తీసుకురావాల్సి వచ్చింది. దీంతో ఏకంగా 1300 కి.మీ దూరం ప్రయాణించి సూరత్ నుంచి హైదరాబాద్‌కు శిశువును తీసుకొచ్చి సికింద్రాబాద్ కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం శిశువు పూర్తిగా కోలుకున్నట్లు ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, పసికందుల వైద్యనిపుణుడు డాక్టర్ బాబు ఎస్. మాదర్కర్ మీడియాకు వెల్లడించారు.

ఈ ప్రయత్నంలో మొత్తం 31 మంది సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. కిమ్స్ కడల్స్, రెడ్ హెల్త్ అంబులెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు మార్గంలో శిశువును ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు చెప్పారు. మొత్తం 15 మంది వైద్యులు, నర్సులు, బయోమెడికల్ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, 11 మంది బ్యాక్ ఎండ్ నిపుణులు, ఐదుగురు పరోక్ష సహాయ చిన్నారి తరలింపులో నిర్విరామంగా కృషి చేసినట్లు చెప్పారు.

ఆస్పత్రికి వచ్చేసరికి చిన్నారికి మల్టీ ఆర్గాన్ సమస్యలు ఉన్నాయని, దాదాపు రెండు నెలలపాటు శిశువును ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందించామని అన్నారు. ఇప్పుడు పూర్తిగా కోలుకున్నట్లు చెప్పారు.

# అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ సుందరీకరణ

## - మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



విశ్వంభర, హైదరాబాద్ః అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ సుందరీకరణ చేపట్టామని హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. గన్ పార్క్ జంక్షన్ ,బిఆర్కె భవన్ దగ్గర సుందరీకరణను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, కార్పొరేటర్ సురేఖ లతో కలసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ అసెంబ్లీ సమీపంలో గన్ పార్క్ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దడమే కాకుండా డిజిటల్ మెకానిజంతో కూడిన అత్యాధునిక డైనమిక్ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశామని, అదేవిదంగా బిఆర్కె భవన్ కూడలిలో రకరకాల ఆకారాలతో ప్రజలకు విజ్ఞానం తోపాటు అహ్లదకరమైన వాతారణం, సంతోషాన్ని కలిగించే విధానంగా తీర్చి దిద్దామన్నారు. ఇవి దృశ్యపరంగా ఆకర్షణీయమైన ప్రదర్శనను సృష్టిస్తుందని, నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో అత్యధిక డిజిటల్ టెక్నాలజీ ను ఉపయోగిస్తూ సుందరవందనంగా రాన్నున్న రోజుల్లో తీర్చి దిద్దుతామని అన్నారు. ఇప్పటికే అనేక చోట్ల ప్రధానమైన కూడళ్లను సుందరంగా తీర్చి దిద్దామని, పర్యాటకులుగాని, ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలుగాని ఒక్కసారి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తే వారు మళ్ళి మళ్ళి ఈ నగరాన్ని సందర్శించాలన్న భావం వారిలో కలగజేసే విదంగా నగరాన్ని సర్వసుందరంగా తీర్చిద్దిదామని తెలిపారు.

# చెరువుల పునరుద్ధరణ వేగంగా జరగాలి

## క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్



విశ్వంభర, హైదరాబాద్ః నగరంలోని చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా జరగాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. మొదట విడత చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణ త్వరగా పూర్తి కావాలన్నారు. ఈ క్రమంలో ఇటీవల అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట, పాతబస్తీలోని బమ్రుక్‌నుద్దౌలా చెరువులను సందర్శించిన హైడ్రా కమిషనర్ సోమవారం సున్నం చెరువును పరిశీలించారు. అలాగే నార్సింగ్ వద్ద సీఎస్ ఆర్ (సామాజిక బాధ్యత) లో భాగంగా తత్వ రియల్ ఎస్టేట్ సంస్థ చేపట్టిన ముష్కి చెరువును కూడా సందర్శించారు. సున్నం చెరువులో డెబ్రీస్‌ను తొలగించే పనులను పర్యవేక్షించారు. చెరువులోకి వరద నీరు నేరుగా చేరేందుకు వీలుగా వెంటనే ఇన్‌లెట్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువు పై భాగంలోని ప్రాంతాల్లో వరద సాఫీగా కిందకు సాగడంలేదనే ఫిర్యాదుల నేపథ్యంలో చెరువు ఇన్‌లెట్ల పనుల ఆవశ్యకతను వివరించారు. అలాగే మురుగు కాలువ డైవర్షన్ పనులు కూడా పూర్తి కావాలన్నారు. ఈ వర్షాకాలంలోనే చెరువుల పునరుద్ధరణ జరగాలని సూచించారు.

**సీఎస్ ఆర్ నిధులు సద్వినియోగం కావాలి..**

సీఎస్ ఆర్ (సామాజిక బాధ్యత) కింద పలు సంస్థలు సమకూరుస్తున్న నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని హైడ్రా కమిషనర్ శ్రీఏవీ రంగనాథ్‌గారు సూచించారు. నార్సింగ్, మణికొండ మున్సిపాలిటీలో సీఎస్ ఆర్ కింద అభివృద్ధి చెందుతున్న ముష్కి చెరువును పరిశీలించారు. ముష్కి చెరువు బండ్ పేరిట ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో పోసిన మట్టిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశించిన హైడ్రా కమిషనర్ ఆ పనుల్లో జాప్యం జరగకుండా హైడ్రా మిషనరీని కూడా దించాలని అధికారులకు సూచించారు. చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని స్థానికులు ఈ సందర్భంగా కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. చెరువులో మురుగు నీరు కలవకుండా చూడాలని.. చెరువు బండ్‌పై భారీమొత్తంలో మొక్కలను నాటి.. గ్రీనరనీ అభివృద్ధి చేయాలన్నారు. పార్కును కూడా అభివృద్ధి చేస్తే ఇక్కడ అనేక నివాసప్రాంతాలవారికి ఎంతో వెసులుబాటుగా ఉంటుందని కమిషనర్‌ను కోరారు.

**ఉత్సవాలకు బతుకమ్మ కుంట సిద్ధం కావాలి..**

సెప్టెంబరు 21న బతుకమ్మ ఉత్సవాలు భారీయెత్తున జరగనున్న నేపథ్యంలో అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణ, సుందరీకరణ పనులు త్వరగా పూర్తి కావాలని సూచించారు. చెరువు చుట్టూ సుందరీకరణతో పాటు.. అందరూ కూర్చొని సేదదీరేవిధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అలాగే పాతబస్తీలోని బమ్రుక్‌నుద్దౌలా చెరువు పునరుద్ధరణ కూడా వేగం కావాలని సూచించారు. చెరువులోకి వర్షపు నీరు సాఫీగా సాగేందుకు ఇన్‌లెట్లను అభివృద్ధి చేయాలన్నారు. మొదటి విడతగా చేపట్టిన 6 చెరువులలో కూకట్‌పల్లి నల్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మ చెరువుల అభివృద్ధి దాదాపుగా పూర్తి అవ్వగా.. మిగతా చెరువులను కూడా ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని సూచించారు.

# బహుజన బతుకమ్మ' పోస్టర్ ఆవిష్కరణ

## సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 3 వరకు బతుకమ్మ వేడుకలు



విశ్వంభర, హైదరాబాద్ః తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమ పతాకగా అంది వచ్చిన బహుజన బతుకమ్మ 2010లో ప్రారంభమై 15 ఏళ్లుగా నిరాఘాటంగా సాగుతూ పలు ప్రజా సమస్యలు లేవనెత్తుతుంది. 2025 బహుజన బతుకమ్మ కార్యక్రమంలో "ప్రకృతి రక్షణే –ప్రజల రక్షణంటూ" చాటి చెబుతూ సెప్టెంబర్ 20, 2025న ఉస్మానియాలో ప్రారంభమై అక్టోబర్ 3 2025న నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో జరిగే కార్యక్రమం తో ముగుస్తుంది. దాదాపు 12 కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమం తో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, ప్రజా సంఘాలు ఈ అవగాహనతో ముందుకు వచ్చి బహుజన బతుకమ్మ కార్యక్రమాలు జరుపుకోవాలని పిలుపునిస్తున్నాం. "బహుజన బతకమ్మ ఒక ఉత్సవమే కాదు–ఉద్యమమంటూ " చాటుతూ ఈరోజు తెలంగాణ అమరుల స్మృతి కేంద్రం గన్ పార్క్ వద్ద కార్యక్రమంలో పోస్టర్లు–కరపత్రాలు ఆవిష్కరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో విమలక్క, ప్రొఫెసర్ లక్ష్మి, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఎనిశెట్టి శంకర్, ఆచార్య కట్టా భగవంత రెడ్డి, టిపిటిఎఫ్ నాయకులు ప్రకాష్ రావు,రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, నాయకుల వెంకటేశ్వర్లు, ఏ ఐ ఎఫ్ టి యు అధ్యక్షులు మల్లేశం, నాయకులు యాకయ్య, అరుణోదయ ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, కార్యదర్శి రాకేష్, పి డి ఎస్ యు (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరు విజయ్, నాయకులు దిలీప్, పి ఓ డబ్ల్యు (స్త్రీ–విముక్తి) గంగారత్నం, సౌజన్య, సంతోష, అరుణోదయ కళాకారులు అరుంధతి, కరుణ, రాజేశ్వరి, అశ్విని, హారిక తదితరులు పాల్గొన్నారు.అడవుల విధ్వంసంతో నాగరికత విధ్వంసం జరగడమే కాకుండా, కరువులు–వరదలు ముంచెత్తడం, కోతుల బెడద లాంటి అంశాలన్నీ జనజీవతాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇక వనరుల విధ్వంసానికి పాల్పడుతున్న కార్పోరేట్లతో, మాఫియాలతో వ్యవసాయం దెబ్బతింటున్నది. ఈ విధ్వంస నమూనా పంట భూములను రియల్ ఎస్టేట్ ప్లాట్లు గా దిగజారుస్తుండడం పెరుగుతున్నది. ఒకనాడు పరిగలేరుకుని బతికిన కూలీలు ఉంటే నేడు 10 ఎకరాల ఆసామి ఆత్మహత్యల పాలవడం వ్యవసాయ సంక్షోభానికి చిహ్నంగా మారింది. ఈ పరిస్థితి మారాలని పోరాడుతున్న వారిని పిట్టల్లా కాల్చి చంపడం పెరిగింది. దీంతో రోజుకో మృతదేహాన్ని చూసి తెలంగాణ పల్లెలు ఘొల్లుమంటున్నాయి. మరొకవైపు పతనమవుతున్న సాంస్కృతిక విలువలతో మద్యపానం, గంజాయి, డ్రగ్స్ లాంటివి పల్లెలను ముంచెత్తుతున్నాయి. నేరాలు ప్రత్యేకించి బాలికలపై ఆగాయిత్యాలు పెరుగుతున్నాయి.అందుకోసం ప్రకృతి రక్షణ, అడవుల రక్షణ, స్త్రీల రక్షణ శాంతి స్వావలంబణ వ్యవసాయాన్ని చాటుతూ "బహుజన బతుకమ్మ" జరుపుకోవాలని తెలంగాణ ప్రజలకు పిలుపునిస్తున్నాం. ప్రజల స్వచ్ఛందంగా పాల్గొనాలని, ఈ కార్యక్రమాల విజయవంతానికి ఇతోదిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సెప్టెంబర్ 14, 2025న బహుజన బతుకమ్మ పాట విడుదల కార్యక్రమం ఉంటుంది.

## వరంగల్‌లో టూరిజం శాఖ

# తొలి బతుకమ్మ వేడుకను విజయవంతం చేస్తాం

### పోస్టర్ ఆవిష్కరణలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



విశ్వంభర, హైదరాబాద్ : ఆడబిడ్డల పోరుగడ్డ వరంగల్ లో టూరిజం శాఖ ఆధ్వర్యంలో తొలి బతుకమ్మ వేడుకలు నిర్వహించడం స్వాగతనీయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రాణిరుద్రమ, సమ్మక్క, సారక్క, చాకలి ఐలమ్మ, హజారే మంగమ్మ వంటి ధీనవనితలు వచ్చి నేల ఓరుగల్లు అని ఆమె పేర్కొన్నారు. అటువంటి వరంగల్ జిల్లాలో టూరిజం శాఖ నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలను మొదటిసారిగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం ప్రశంసానీయమని చెప్పారు.సోమవారం మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతిలతో కలిసి ఆమె బతుకమ్మ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ?పూలతో దేవున్ని కొలిచే ఈ పండుగ ప్రపంచంలో మరెక్కడా లేని ప్రత్యేకత అని చెప్పుకొచ్చారు. ?బతుకమ్మ కేవలం ఒక పండుగ కాదని, ఇది తెలంగాణ ఆత్మగౌరవ వేడుక అని సురేఖ వివరించారు. ?మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండే, సమాజాన్ని, కుటుంబాలను కలిపే పండుగ అని చెప్పారు. ?ప్రకృతి, పర్యావరణం, పూలతో మన బంధాన్ని ప్రతిబింబించేలా సంబరాలు చేస్తామన్నారు.

# సాధన దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



విశ్వంభర, కొత్తగూడెంః ఈనెల 9న జరగబోయే వైశ్య వికాస్ వేదిక ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో జరగనున్న సాధనా దీక్ష సంబంధించిన కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ధారా నగేష్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొదుమూరి దయాకర్ , వైశ్య వికాస వేదిక ట్రస్ట్ మెంబర్, కొదుమూరి భాను ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కొదుమూరి సురేష్భ, ద్రాద్రి జిల్లా యువజన సంఘం కోశాధికారి, కుక్కడపు రామారావు , చంద్రుగొండ, గునిపాటి సుధాకర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, నరేంద్రల రిషి కుమార్ కోశాధికారి, కొయ్యడ నగేష్, కొయ్యాడా రాజశేఖర్, దారా కిరణ్, కూర ప్రసాద్, వందనపు నాగేశ్వరరావు, ధరణి చిన్న, చల్లా శేఖర్, ఉప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అలాయ్ బలాయికి రాష్ట్రపతిని ఆహ్వానించిన దత్తాత్రేయ



విశ్వంభర, హైదరాబాద్ః అక్టోబర్ 3న హైదరాబాదులో నిర్వహించే అలాయ్ బలాయి కార్యక్రమానికి రావలసిందిగా సోమవారం నాడు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

# దామోదర్ రెడ్డిని పరామర్శించిన గాదరి కిశోర్ కుమార్




విశ్వంభర, తుంగతుర్తిః తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని తన నివాసంలో మాజీ మంత్రి వర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి ని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ పరామర్శించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా తెలంగాణ పౌర సమాజం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న టి.జే.ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

# పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు చేదు అనుభవం

షాంఘై : పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది. చైనాలోని తియాంజిన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంఘంశిఖరాగ సమావేశాలకు ప్రపంచ దేశాధినేతలు హాజరయ్యారు. అయితే ఈ మీటింగ్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్, భారత ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఎస్‌సీవో సమావేశంలో పుతిన్, మోదీపైనే అందరి దృష్టి నిలిచింది. ఓ దశలో పుతిన్, మోదీ.. ఇద్దరూ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందు నుంచే వెళ్లారు. పుతిన్, మోదీలు మాట్లాడుకుంటూ ముందుకు నడిచారు. వరుసగా నిలబడ్డ పాక్ ప్రధాని గురించి ఆ ఇద్దరూ ఆలోచించలేదు. పుతిన్, మోదీ ముందు నుంచి వెళ్తుంటే పాక్ ప్రధాని షరీఫ్ వాళ్లను చూస్తూ ఉండిపోయారు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతున్నది.



# కేసీఆర్, హరీశ్ రావులకు ఇక మిగిలింది జైలే... బెయిల్ కాదు!



విశ్వంభర, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి, లక్ష కోట్లు దోచుకున్న కేసీఆర్, హరీశ్ రావు, ఇతర బీఆర్ఎస్ నాయకులకు ఇక మిగిలింది జైలు మాత్రమేని, బెయిల్ కాదని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వారా, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసాధారణమైన నిర్ణయం తీసుకున్నదన్నారు. కేసీఆర్ కుటుంబీకులు దోచుకున్న లక్ష కోట్లను తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికవరీ చట్టం కింద తిరిగి వసూలు చేస్తుందన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలోనే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఈ హామీచ్చారని గుర్తు చేశారు.కాళేశ్వరంలో జరిగిన అవినీతికి వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ కుటుంబమంతా ఒక్కటై పోరాడి విజయం సాధించిందని బండి సుధాకర్ గౌడ్ అన్నారు. ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ కాంగ్రెస్ నేతలంతా కాళేశ్వరంలో జరిగిన అవినీతి వ్యతిరేక పోరాటంలో ఐక్యంగా నిలిచారన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్, హరీశ్ రావులు ఏ తప్పు చేయకుంటే.. స్టే కోసం కోర్టును ఆశ్రయించడం ఎందుకు? అని బండి సుధాకర్ గౌడ్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పకుండా కోర్టుకు వెళ్లడంతోనే వాళ్ల అవినీతి వెల్లడవుతున్నదన్నారు. కాళేశ్వరం అవినీతి ఎంత దాచిపెట్టినా దాగేది కాదని, తెలంగాణ ప్రజలు సహించినా ప్రకృతి మాత్రం సహించలేకపోయిందనీ, అందుకే సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాళేశ్వరం పిల్లర్లు కుంగిపోయేలా చేసి, ప్రజలకు నిజాలను వెల్లడి చేసిందని బండి సుధాకర్ అన్నారు. ప్రపంచస్థాయి ప్రాజెక్టు అని ఎంతో గొప్పగా చెప్పుకున్న కాళేశ్వరం... ఇవాళ కేసీఆర్ కుటుంబం చేసిన ద్రోహానికి స్మారక చిహ్నంగా మిగిలిపోయిందన్నారు. కాళేశ్వరం కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేసీఆర్, హరీశ్ రావులు వెంటనే తమ పదవులకు రాజీనామాలు చేసి, అమరవీరుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్ ను బీజేపీ కాపాడుతున్నదని, ఇవి రహస్య మిత్రులని, అవినీతి వ్యవహారాల్లో ఒకరికొకరు సహకరించుకుంటున్నాయని, ఈ నిజాన్ని తెలంగాణ ప్రజలు తెలుసుకోవాలని బండి సుధాకర్ కోరారు.

# అసమర్థ ముఖ్యమంత్రి.. అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు ః బోయపల్లి రమేష్

విశ్వంభర, హైదరాబాద్ః ఆదివారం అర్ధరాత్రి అదరాబాదర కాలేశ్వరంపై ఘోష్ కమిటీ ఇచ్చిన చెత్త రిపోర్టుని ఎక్కడ ప్రజలు ,కోర్టు తిరస్కరిస్తాదని భావించి ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ప్రజలు వరదలతో, రైతులు యూరియా కొరతతో, విద్యార్థులు మౌలిక వసతుల కొరతతో ,తీవ్ర ఇబ్బందులు గురవుతున్న పట్టించుకోకుండా రేవంత్ రెడ్డి గారు మాజీ ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ని ఇబ్బందికి గురి చేయాలని గోష్ తప్పుడు నివేదికని అసెంబ్లీలో పెట్టి అభాష్ పాలు కావడం జరిగింది. రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఒక్క మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు గారి ప్రసంగాన్ని 33 సార్లు అడ్డుకొని తన చేతగాని తలనాన్ని నిరూపించుకోవడం జరిగింది ప్రజలు కాంగ్రెస్ పార్టీ చెకిలి చేష్టలు రేవంత్ రెడ్డి రాజకీయ నైరాశంలో పెట్టిన బిల్లుగా ప్రజలు అర్థం చేసుకున్నారని తేటతెల్లమైంది కానీ రేవంత్ రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడమే కంకణం కట్టుకొని తప్పుడు నివేదిక ఇచ్చిన ఘోష్ కమిటీని రిపోర్టును సిబిఐ కివ్వడం రేవంత్ రెడ్డి దివాలాకోరు రాజకీయానికి చేతగానితనానికి నిదర్శనం అని బోయపల్లి రమేష్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర అంధకారంలో నెట్టి వేయబడ్డారు ఇకనైనా కాంగ్రెస్ శ్రేణులు రేవంత్ రెడ్డి ట్రాప్ లో పడకుండా ఉంటారని ఆశిస్తున్నాను ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉన్న కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల్లో ఓడించి తీరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వెంకన్న ,రవీందర్ ,వెంకటేశం, శివ ,స్వామి, సంపత్ జస్వంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# ముంబయి వీధులను రేపటిలోగా ఖాళీ చేయండి: బాంబే హైకోర్టు

విశ్వంభర, ముంబయి: మరాఠాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. మరోవైపు మరాఠా కోటా నిరసనలపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిరసనలు ముంబయిలో తీవ్ర ట్రాఫిక్ జామ్‌కు కారణం కావడంతో హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రేపటి(సెప్టెంబర్ 2)లోగా నిరసనకారులు ముంబయి వీధులను వీడాలని ఆదేశాలిచ్చింది. సోమవారం ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో మరాఠా రిజర్వేషన్ల ఆందోళన చేపట్టారు. వేలాది మంది నిరసనకారులు దక్షిణ ముంబయికి చేరుకోవడంతో.. సీఎస్‌టీ, ఫోర్ట్, చర్చిగేట్ తదితర మార్గాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నిరసనకారులు పలు మార్గాలను బ్లాక్ చేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ నిరసనలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిరసనలు శాంతియుతంగా జరగడం లేదని.. నిబంధనలన్నీ ఉల్లంఘిస్తున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. ఉద్యమకారుడు మనోజ్ జరాంగే పాటిల్, అతడి మద్దతుదారులు ముంబయి వీధులను మంగళవారం మధ్యాహ్నంలోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలన్న తన డిమాండ్ నెరవేరే వరకూ ముంబయి విడిచి వెళ్లబోనని కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే పాటిల్ ఆదివారం తెగేసిచెప్పిన విషయం తెలిసిందే.



# అమ్మాయిలపై కాసుల వర్షం మరికొద్దిరోజుల్లో భారత్, శ్రీలంక వేదికలుగా మొదలుకాబోయే మహిళల వన్డే ప్రపంచకప్ ముందు మహిళా

ముంబాయ్: మరికొద్దిరోజుల్లో భారత్, శ్రీలంక వేదికలుగా మొదలుకాబోయే మహిళల వన్డే ప్రపంచకప్ ముందు మహిళా క్రికెటర్లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుభవార్త చెప్పింది. వన్డే ప్రపంచకప్ ఈవెంట్‌కు మునుపెన్నడూ లేని విధంగా, పురుషుల క్రికెట్ కంటే ఎక్కువగా ప్రైజ్‌మనీని పెంచి అమ్మాయిలపై కాసుల వర్షం కురిపించనుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 02 వరకు 8 జట్లు పాల్గొనబోయే వన్డే ప్రపంచకప్ కోసం 13.88 యూఎస్ మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 122.5 కోట్లు) నగదు బహుమతిని ప్రకటించింది. న్యూజిలాండ్‌లో జరిగిన 2022 ఎడిషన్‌తో (రూ. 31 కోట్లు) పోల్చితే ఇది సుమారు నాలుగింతలు అధికం. ఈ మెగా ఈవెంట్‌లో విజేతగా నిలిచే జట్టుకు రూ. 39.55 కోట్లు (4.48 మిలియన్ యూఎస్ డాలర్లు) అందనుంది. గత ఎడిషన్‌లో టైటిల్ గెలిచిన ఆస్ట్రేలియాకు రూ. 11.65 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. దానితో పోలిస్తే ఇది మూడింతలు ఎక్కువ కావడం విశేషం. 2025 ఎడిషన్‌లో రన్నరప్‌నకు రూ. 19.77 కోట్లు (2022లో రూ. 5.30 కోట్లు) దక్కనుంది. భారత్ వేదికగా 2023లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ప్రైజ్‌మనీ (రూ. 88.26 కోట్లు) కంటే తాజా పెంపు అధికం. అప్పుడు ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా జట్టుకు




దక్కిన మొత్తం (రూ. 35 కోట్లు) కంటే ఇప్పుడు మహిళల వరల్డ్ కప్ గెలుచుకున్న జట్టుకు (రూ. 40 కోట్లు) మరో రూ. 5 కోట్లు అదనంగా దక్కనుంది. ఇక ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో సెమీస్ చేరిన జట్లకు రూ. 9.89 కోట్లు (గత ఎడిషన్‌లో రూ. 2.65 కోట్లు) అందజేయనుండగా ఐదు, ఆరు స్థానాల్లో నిలిచే జట్లకు రూ. 4.50 కోట్లు అందనుంది. 7,8 స్థానాల్లో నిలిచే జట్లకు రూ. 2. 2 కోట్లు ఇవ్వనుండగా ప్రపంచకప్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకూ అదనంగా రూ. 2 కోట్లు దక్కుతాయి. మహిళల క్రికెట్‌కు ప్రోత్సహించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఐసీసీ తెలిపింది.

# వెస్ట్ ఢిల్లీదే డీపీఎల్ టైటిల్

ఢిల్లీ: నెల రోజులుగా దేశ రాజధానిలోని క్రికెట్ అభిమానులకు టీ20 మజాను పంచిన ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్)లో రెండో సీజన్ టైటిల్‌ను వెస్ట్ ఢిల్లీ లయన్స్ గెలుచుకుంది. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్‌లో వెస్ట్ ఢిల్లీ.. 6 వికెట్ల తేడాతో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్‌ను ఓడించి తొలి టైటిల్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సెంట్రల్ ఢిల్లీ.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 173 రన్స్ చేసింది. యుగల్ సైని (65), ప్రాన్షు విజయరన్ (50) రాణించారు. అనంతరం ఛేదనలో కెప్టెన్ నితీశ్ రాణా 79 నాటౌట్ వీరవిహారం చేసి ఆ జట్టుకు విజయాన్ని అందించాడు. 18 ఓవర్లలోనే ఆ జట్టు 4 వికెట్లు కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది.



# భారత్ 15 కజకిస్తాన్ 0



రాజ్‌గిర్ (బిహార్): తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో ఒక్కో గోల్ తేడాతో నెగ్గిన భారత హాకీ జట్టు... చివరి లీగ్ మ్యాచ్‌లో మాత్రం చెలరేగిపోయింది. ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నీలో భాగంగా... కజకిస్తాన్ జట్టుతో సోమవారం జరిగిన పూల్ 'ఎ' ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 15%-%0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ తరపున ఎనిమిది మంది ఆటగాళ్లు గోల్స్ చేశారు. టీమిండియా సగటున నాలుగు నిమిషాలకు ఒక్కో గోల్ సాధించడం విశేషం. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి టీమిండియా అజేయంగా నిలిచింది. తొమ్మిది పాయింట్లతో పూల్ 'ఎ'లో అగ్రస్థానం పొందిన భారత బృందం 'సూపర్-4' సెమీఫైనల్ దశకు అర్హత సాధించింది. అంతర్జాతీయస్థాయిలో తొలిసారి కజకిస్తాన్‌తో పోటీపడ్డ భారత్ ప్రత్యర్థి జట్టుపై ఎడతెరిపిలేని దాడులు నిర్వహించి హడలెత్తించింది. ఐదో నిమిషంలో భారత్ నుంచి తొలి గోల్ నమోదుకాగా... మ్యాచ్ ముగియడానికి మరో నిమిషం వరకు ఈ గోల్స్ వేట కొనసాగింది. భారత్ తరపున అభిషేక్ (5వ, 8వ, 20వ, 59వ నిమిషాల్లో) అత్యధికంగా నాలుగు గోల్స్ చేశాడు. సుఖ్‌జీత్ సింగ్ (15వ, 32వ, 38వ నిమిషాల్లో), జుగ్‌రాజ్ సింగ్ (24వ, 31వ, 47వ నిమిషాల్లో) మూడు గోల్స్ చొప్పున సాధించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (26వ నిమిషంలో), అమిత్ రోహిదాస్ (29వ నిమిషంలో), రాజిందర్ సింగ్ (32వ నిమిషంలో), సంజయ్ (54వ నిమిషంలో), దిల్‌ప్రీత్ సింగ్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. భారత జట్టుకు 13 పెనాల్టీ కార్నర్‌లు, 2 పెనాల్టీ స్ట్రోక్‌లు లభించాయి. 13 పెనాల్టీ కార్నర్‌లలో కేవలం నాలుగింటిని మాత్రమే భారత ఆటగాళ్లు గోల్స్‌గా మలిచారు. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. కజకిస్తాన్ జట్టు తమకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకుంది.

## పసికూనను చిత్తు చేసి..

# టీ20 సిరీస్ కైవసం

నెదర్లాండ్స్‌తో రెండో టీ20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఘన విజయం సాధించింది. పర్యాటక జట్టును ఏకంగా తొమ్మిది వికెట్ల తేడాతో లిటన్ దాస్ బృందం చిత్తు చేసింది. తద్వారా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంది. కాగా ఆసియా కప్-2025 సన్నాహకాల్లో భాగంగా బంగ్లాదేశ్ సొంతగడ్డపై నెదర్లాండ్స్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతోంది. ఈ క్రమంలో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచిన బంగ్లా జట్టు.. తాజాగా రెండో టీ20లోనూ సత్తా చాటింది. సెల్హెట్ వేదికగా సోమవారం నాటి మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ ఆతిథ్య జట్టు బౌలర్ల ధాటికి కుప్పకూలింది. 17.3 ఓవర్లలో కేవలం 103 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఓపెనర్లలో మాక్ ఒడౌడ్ (8) విఫలం కాగా.. విక్రమ్‌జిత్ సింగ్ (24) ఫర్వాలేదనిపించాడు. ఇక వన్‌డౌన్లో వచ్చిన తేజ నిడమానూరు డకౌట్ కాగా.. ఆ తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్ చేసిన కెప్టెన్ చార్ల్స్ ఎడ్వర్డ్స్ (9), షారిజ్ అహ్మద్ (12), నోవా క్రోస్ (2), సికందర్ జుల్ఫికర్ (2) కూడా చేతులెత్తేశారు. కైల్ క్లెన్ (4) కూడా విఫలం కాగా.. ఆఖర్లో ఆర్యన్ దత్ 24 బంతుల్లో 30 పరుగులు చేసి డచ్ జట్టు ఇన్నింగ్స్‌లో టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక బంగ్లా బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ నసూమ్ అహ్మద్ మూడు వికెట్లతో సత్తా చాటగా.. టస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్ తలా రెండు వికెట్లు కూల్చారు. మిగిలిన వారిలో మెహదీ హసన్, తాంజిమ్ హసన్ సకీబ్ చెరో వికెట్ దక్కించుకున్నారు. ఇక లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ మరోసారి దుమ్మురేపింది. ఆతిథ్య జట్టు బౌలర్ల ధాటికి కుప్పకూలింది. 17.3 ఓవర్లలో కేవలం 103 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఓపెనర్లలో మాక్ ఒడౌడ్ (8) విఫలం కాగా.. విక్రమ్‌జిత్ సింగ్ (24) ఫర్వాలేదనిపించాడు. ఇక వన్‌డౌన్లో వచ్చిన తేజ నిడమానూరు



డకౌట్ కాగా.. 13.1 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్ మాత్రమే నష్టపోయి 104 పరుగులు సాధించింది. ఓపెనర్లలో పర్వేజ్ హొసేన్ ఇమాన్ 23 పరుగులతో ఫర్వాలేదనిపించగా.. తాంజిద్ హసన్ తమీమ్ అర్ధ శతకంతో సత్తా చాటాడు. మొత్తంగా 40 బంతులు ఎదుర్కొన్న తాంజిద్.. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 54 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడికి తోడుగా కెప్టెన్ లిటన్ దాస్ (18 బంతుల్లో 18 నాటౌట్) నిలవగా.. ఫోర్‌తో తాంజిద్ బంగ్లా విజయాన్ని ఖరారు చేశాడు. ఇక నెదర్లాండ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించిన నసూమ్ అహ్మద్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. బంగ్లాదేశ్-నెదర్లాండ్స్ మధ్య నామమాత్రపు మూడో టీ20కి బుధవారం (సెప్టెంబరు 3) షెడ్యూల్ ఖరారైంది.

## రూ. 6 వేల కోట్ల 'పెద్ద' నోట్లు ఇంకా చలామణీలో..



ముంబై: రిజర్వ్ బ్యాంక్ రూ. 2,000 నోట్లను ఉపసంహరించి రెండేళ్లవుతున్నా ఇప్పటికీ రూ. 5,956 కోట్ల విలువ చేసే నోట్లు చలామణీలో ఉన్నాయి. ఆర్‌బీఐ సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. 2023 మే 19న ఈ పెద్ద నోట్లను వెనక్కి తీసుకుంటున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ రోజున మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ. 2,000 నోట్లు చలామణీలో ఉండగా 2025 ఆగస్టు 31 నాటికి ఇది రూ. 5,956 కోట్లకు తగ్గినట్లు ఆర్‌బీఐ తెలిపింది. 98.33 శాతం పెద్ద నోట్లు వెనక్కి వచ్చినట్లు పేర్కొంది. రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించినప్పటికీ, వాటిని రద్దు చేయలేదు కాబట్టి చలామణీలో ఉన్నవి చెల్లుబాటు అవుతాయి. ఈ నోట్లను బ్యాంక్ అకౌంట్లలో డిపాజిట్ చేసుకోవచ్చు. తమ ఖాతాల్లో జమ చేసుకునేందుకు ఇండియా పోస్ట్ ద్వారా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లోని ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీసులకు ఇండియా పోస్ట్ ద్వారా పంపించవచ్చు.

## వాహన విక్రయాలు డౌన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: వాహన విక్రయా లు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. జీఎస్టీని హేతుబద్ధీకరించనుండటంతో ధరలు తగ్గుతాయన్న అంచనాతో కొనుగోలుదారులు వెనుకంజ వేశారు. దీంతో ఆగస్టు నెలలో వాహన విక్రయాలకు బ్రేక్‌పడింది. వాహన దిగ్గజ సంస్థలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, మహీంద్రా, టాటా మోటర్స్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో మారుతి అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 8 శాతం తగ్గగా, హ్యుందాయ్ సేల్స్ 4 శాతం, మహీంద్రా ఒక్కశాతం తగ్గుముఖం పట్టాయి.



# జీఎస్‌టీ తగ్గింపు నేపథ్యంలో వేచి చూసే ధోరణి

## ఇది తాత్కాలికమేనంటున్న నిపుణులు

న్యూఢిల్లీ: కీలకమైన పండుగల సమయంలో వినియోగదారులు (ఆన్‌లైన్ షాపర్లు) ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ గూడ్స్ తదితర ఉత్పత్తుల కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారు. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) క్రమబద్ధీకరణతో రేట్లు తగ్గుతాయన్న అంచనాలే ఇందుకు కారణం. అయితే ఈ పరిస్థితి తాతాల్కిమేనని, ఒక్కసారి పన్ను రేట్లపై స్పష్టత వస్తే కొనుగోళ్లు తిరిగి ఊపందుకుంటాయన్నది నిపుణుల అంచనా. కేంద్ర ప్రభుత్వం సైతం జీఎస్‌టీలో శ్లాబుల తగ్గింపును వేగంగా అమల్లోకి తీసుకురావాలనుకుంటోంది. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 3, 4 తేదీల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్‌టీ కౌన్సిల్ భేటీ కానుంది. ప్రస్తుతం వివిధ రకాల వస్తు సేవలపై 5, 12, 18, 28 శాతం జీఎస్‌టీ రేట్లు అమల్లో ఉండడం తెలిసిందే. 12, 28 శాతం శ్లాబులను ఎత్తివేయాలన్నది ప్రతిపాదన. అప్పుడు అధిక శాతం వస్తు సేవలు 5 లేదా 18 శాతం రేట్ల పరిధిలోకి వస్తాయి. వాషింగ్ మెషిన్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఎన్నో ఉత్పత్తులపై పన్ను భారం తగ్గనుంది. ఈ%-%కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై వినియోగదారుల కొనుగోళ్ల పరంగా స్పష్టమైన మార్పు కనిపిస్తున్నట్లు గ్రాంట్ థార్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ నవీన్ మల్పానీ తెలిపారు. ముఖ్యంగా అధిక విలువ కలిగిన ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విషయంలో ఈ ధోరణి నెలకొన్నట్టు చెప్పారు. "జీఎస్‌టీ రేట్లపై స్పష్టత ఆలస్యమయితే అప్పుడు ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు తదితర విభాగాలపై 25%-%30 శాతం మేర ప్రభావం పడొచ్చు. కొత్త శ్లాబులు అమల్లోకి వస్తే రేట్లు తగ్గుతాయన్న అంచనాలు ప్రస్తుత వేచి చూసే ధోరణికి కారణమవుతున్నాయి. ఉదాహరణకు రూ. 1.2 లక్షల ఖరీదైన స్మార్ట్‌ఫోన్ ధర జీఎస్‌టీలో సంస్కరణల అనంతరం 10 శాతం మేర తగ్గనుంది. ఈ అంచనాలు కొనుగోళ్ల నిర్ణయాలను వాయిదా వేసుకునేందుకు దారితీస్తున్నాయి"అని మల్పానీ వివరించారు. "రిటైలర్ల వద్ద ఉత్పత్తుల నిల్వలు అధికంగానే ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విభాగంలో కొనుగోళ్లు వాయిదా పడుతున్నాయి. పండుగల సీజన్ చివర్లో (అక్టోబర్) పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా సన్నద్ధం అయ్యేందుకు ఈ%-%కామర్స్ సంస్థలు బ్రాండ్లతో సంప్రదింపులు చేస్తున్నాయి. జీఎస్‌టీలో



పన్ను రేట్ల సవరణ ధరల వ్యూహాల్లోనూ మార్పులకు దారితీయనుంది. మొత్తం మీద సమీప కాలంలో కనిపించే ప్రభావం తాత్కాలికమే. కొత్త పన్నులపై ఒక్కసారి స్పష్టత వస్తే అమ్మకాలు వేగంగా పుంజుకుంటాయి" అని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సీనియర్ అనలిస్ట్ శుభమ్ నింకార్ తెలిపారు. ఈ%-%కామర్స్ సంస్థలకు పండుగల సీజన్ ఎంతో కీలకం. వార్షిక అమ్మకాల్లో పావు శాతం ఈ సమయంలోనే నమోదవుతుంటాయి. పండుగల సమయంలో కొనుగోళ్లు కేవలం సంస్కృతిలో భాగమే కాకుండా, భావోద్వేగపరమైనవి అని షిప్‌రాకెట్ ఎండీ, సీఈవో సాహిల్ గోయల్ పేర్కొన్నారు. "కొత్త గృహోపకరణం అయినా, గ్యాడ్జెట్ అయినా లేక గృహ నవీకరణ అయినా పండుగల సమయంలో కొనుగోలు చేసేందుకు కుటుంబాలు ప్రణాళికలతో ఉంటాయి. ఈ అంతర్గత డిమాండ్ కచ్చితంగా కొనసాగుతుంది. జీఎస్‌టీ క్రమబద్ధీకరణ అన్నది కొనుగోళ్ల దిశగా వినియోగదారులకు మరింత ప్రోత్సాహాన్నిస్తుంది. రేట్ల సవరణతో ధరలు అందుబాటులోకి వస్తాయి. వినియోగదారుల కొనుగోలు శక్తి పెరుగుతుంది"అని వివరించారు. జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణ అన్నది నిర్మాణాత్మక సంస్కరణ అని, వినియోగానికి బలమైన ఊతం ఇస్తుందని ఫ్లిప్‌కార్ట్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ సైతం అభిప్రాయపడ్డారు. జీఎస్‌టీలో మార్పులు అమల్లోకి వచ్చినట్టయితే పండుగల సీజన్‌లో ఈ%-%కామర్స్ అమ్మకాలు మొత్తం మీద 15%-%20 శాతం పెరగొచ్చని (గతేడాదితో పోల్చితే) మల్పానీ అంచనా వేశారు.

## 10 గ్రాములు.. రూ.1,05,670.. ఆల్‌టైమ్ హైకి బంగారం ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ హైకి చేరాయి. ఇటీవలికాలంలో గోల్డ్, సిల్వర్ రేట్లు క్రమేణా పెరుగుతూ సరికొత్త రికార్డులను సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవారం తులం పసిడి, కిలో వెండి విలువ మరో రూ. 1,000 చొప్పున ఎగిశాయి. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా ఢిల్లీలో 99.9 స్వచ్ఛత (24 క్యారెట్) కలిగిన 10 గ్రాముల పుత్తడి ధర రూ. 1,05,670గా నమోదైంది. అలాగే కిలో వెండి రూ. 1,26,000కు చేరిందని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. కాగా, శనివారం ఒక్కరోజే రూ. 6,000 ఎగబాకడం గమనార్హం. సాధారణ కొనుగోలుదారులతోపాటు పరిశ్రమ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్ ధరలు విజృంభించేలా చేస్తున్నదని వ్యాపారులు అంటున్నారు. అంతర్జాతీయ కారణాలతోనే దేశీయంగా బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి. ఈ నెలలో వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ తగ్గిస్తుందన్న అంచనాలు, విదేశీ మార్కెట్లలో పసిడికి పెరుగుతున్న డిమాండ్, స్టాక్ మార్కెట్ల నుంచి గోల్డ్ వైపునకు మదుపరుల పెట్టుబడులు మారుతుండటం వంటివి రేట్లను ఎగదోస్తున్నట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం, భౌగోళిక-రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, అమెరికా అధ్యక్షుడు



డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు సైతం గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఇదిలావుంటే గ్లోబల్ స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు 22.51 డాలర్లు పుంజుకొని 3,470.51 డాలర్లు పలికింది. వెండి ఔన్స్ 40.47 డాలర్లుగా ఉన్నది. ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ రేట్లు ఎగిసిపడుతున్నాయి. దేశీయంగా మల్టీ ఎంసీఎక్స్‌పై అక్టోబర్ కాంట్రాక్ట్‌కుగాను తులం రూ. 1,05,937గా నమోదైంది. డిసెంబర్‌కు రూ. 1,06,539గా పలికింది. వెండి డిసెంబర్ కాంట్రాక్ట్‌కుగాను కిలో రూ. 1,24,990గా ఉన్నది. ఇక అంతర్జాతీయంగా కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో డిసెంబర్ కాంట్రాక్ట్ రికార్డు స్థాయిలో ఔన్స్ 3,556.87 డాలర్లుగా నమోదైంది. సిల్వర్ 14 ఏండ్ల గరిష్ఠాన్ని తాకుతూ ఔన్స్ 41 డాలర్లు పలకడం విశేషం.

## కొనుగోళ్ల మద్దతుతో..



ముంబై, సెప్టెంబర్ 1: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లకు మదుపరుల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 7.8 శాతంగా నమోదవడం మదుపరులను ఉత్సాహపర్చింది. దీంతో ఉదయం ఆరంభం నుంచీ మార్కెట్లు లాభాల్లోనే కదలాడాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 554.84 పాయింట్లు లేదా 0.70 శాతం పెరిగి 80,364.49 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 597.19 పాయింట్లు పుంజుకున్న ది. నిఫ్టీ సైతం 198.20 పాయింట్లు లేదా 0.81 శాతం అందుకుని 24,625.05 వద్ద స్థిరపడింది. అంతకుముందు 3 రోజులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో ఈక్విటీ మార్కెట్లు నష్టాలకే పరిమితమైన విషయం తెలిసిందే. ఆసియా మార్కెట్లలో చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో.. దక్షిణ కొరియా, జపాన్ సూచీలు నష్టాల్లో ముగిశాయి.

## యూపీఐ లావాదేవీల రికార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత నెలలో 20 బిలియన్ల లావాదేవీలు జరిగినట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. విలువ పరంగా చూస్తే రూ. 24.85 లక్షల కోట్లుగా నమోదైంది. జూలై నెలలో నమోదైన రూ. 25.08 లక్షల కోట్ల కంటే ఇది తక్కువగా నమోదుకావడం విశేషం. అలాగే మే నెలలో రికార్డు స్థాయి రూ. 25.14 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన రూ. 20.60 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే మాత్రం 21 శాతం పెరిగాయి. సరాసరిగా గత నెలలో రోజుకు రూ. 80,177 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయని ఎన్‌పీసీఐ తాజాగా వెల్లడించింది. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో 85 శాతం యూపీఐ ద్వారా జరుగుతుండటం విశేషం.



# పాక్ క్రికెటర్‌తో తమన్నా పెళ్లి..?



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా పెళ్లి గురించి ఇటీవల అనేక ప్రచారాలు నెట్టింట హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన పెళ్లి గురించి వస్తున్న పుకార్లపై స్పందించారు తమన్నా. మూడు పదుల వయసు దాటినా ఇంకా వివాహ బంధంలోకి అడుగుపెట్టని తమన్నా, పలువురిని వివాహం చేసుకోబోతుందని సోషల్ మీడియాలో జోరుగా వార్తలు వచ్చాయి. గత కొంతకాలంగా పాక్ మాజీ క్రికెటర్ అబ్దుల్ రజాక్‌ని పెళ్లి చేసుకోబోతున్నట్టు ప్రచారం జరగగా, తాజాగా ఈ రూమర్స్‌పై ఆమె స్పష్టత ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తమన్నా సోషల్ మీడియాలో ఇలాంటి గాసిప్స్ ఎలా పుట్టుకొస్తాయో తెలియదు. గతంలో ఒకసారి జ్యువెల్లరీ షాపు ఓపెనింగ్ కోసం అబ్దుల్ రజాక్‌తో కలిసి వెళ్లాను. అంతే కానీ మాకు ఎటువంటి వ్యక్తిగత సంబంధం లేదు.ఒక పబ్లిక్ ఈవెంట్‌లో కలిసి కనిపించినంత మాత్రాన పెళ్లి రూమర్స్ రావడం ఆశ్చర్యంగా ఉంది అని తెలిపారు తమన్నా. అలాగే ఒకప్పుడు విరాట్ కోహ్లీతో డేటింగ్ చేసారన్న వార్తల గురించి కూడా మాట్లాడుతూ.. ఒక్కసారి మాత్రమే నేను విరాట్‌ను కలిసాను. ఆ క్షణమే అనేక రూమర్లు వచ్చాయి. ఆ టైంలో మానసికంగా చాలా ఇబ్బంది పడ్డాను. నిజానికి అప్పటి తరువాత మళ్లీ విరాట్‌ను కలిసే అవకాశమే రాలేదు అని తెలిపారు.

# విశ్వంభరలో.. చందమామ..



టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వస్తున్న విజువల్ వండర్ విశ్వంభర సినిమా పట్ల అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. సోషియో ఫాంటసీ జోనర్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ని యంగ్ డైరెక్టర్ వశిష్ట తెరకెక్కిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. మెగాస్టార్ సరసన త్రిష ప్రధాన కథానాయికగా కనిపించనుండగా, కన్నడ బ్యూటీ ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్, ఇతరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాజిటివ్ ఎనర్జీ ఇచ్చిన నెగిటివ్ రోల్ ఇప్పుడు చిత్ర బృందం ఆశికా రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌లో ఆశికా రంగనాథ్ సంప్రదాయ దుస్తుల్లో, చందమామ లాంటి మెరుపుతో అందంగా కనిపించారు. నెక్లెస్ చేతికి గాజులు, నుదుటి బొట్టు.. మొత్తం లుక్ ఆకర్షణీయంగా, కలర్‌ఫుల్‌గా ఉండటంతో ఈ క్యారెక్టర్‌పై ఇంట్రెస్ట్ పెరిగింది. ఆమె గ్లామర్ యాంగిల్‌ని హైలైట్ చేస్తూ రూపొందించిన పోస్టర్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. మెగా ఫ్యాన్స్ తో పాటు సాధారణ ఆడియన్స్ కూడా ఆశికా కొత్త లుక్‌పై పాజిటివ్ కామెంట్లు చేస్తున్నారు.




# సినిమా..

## జోరుగా సినిమాల షూటింగులు



తెలుగు చిత్ర పరిశ్రమకు కేరాఫ్‌గా చెప్పబడే హైదరాబాద్‌లో నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులు నివాసం ఉంటుంటారు. (ఇతర భాషల వాళ్లు కూడా కొంతమంది). విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఇటీవల షూటింగ్‌లు కొనసాగుతున్నాయి. సినిమా షూటింగ్‌లకు అనువైన స్టూడియోలు హైదరాబాద్‌తో పాటుగా దాని పరిసర ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకమైన సెట్టింగులు వేసి నిర్మాతలు చిత్రీకరణలు జరుపుతుంటారు. రాబోయేకాలంలో వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్ వంటి పండుగలు ఉన్నాయి. ఆయా సినిమాల విడుదలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఎక్కువగా హైదరాబాద్‌లోనూ, దాని పరిసర ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్‌లు పెద్దఎత్తున కొనసాగు తున్నాయి. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్, పవన్ కల్యాణ్, నాగచైతన్య, రామ్ పోతినేని, విజరు సేతుపతి, సాయిదుర్గా తేజ్, తేజా సజ్జా, అఖిల్ అక్కినేని, సిద్ధు జొన్నలగడ్డ వంటి పలువురు కథానాయకుల సినిమాల షూటింగ్‌లు గత కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్నాయి.

యాక్షన్ సన్నివేశాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్': హరిహర వీరమల్లు సినిమా తర్వాత పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. 'గబ్బర్‌సింగ్' (2012) తర్వాత ఈ హిట్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రమిదే. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. పవన్‌కళ్యాణ్ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. క్లైమాక్స్‌లో భాగంగా కీలక సన్నివేనబకాంత మాస్టర్ పర్యవేక్షణలో అల్యూమినియం ఫ్యాక్టరీలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో 'డాగన్': 'దేవర' వంటి హిట్ సినిమా తర్వాత ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. గుల్షన్‌కుమార్, భూషణ్‌కుమార్‌బీ టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగు తోంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదలకానుంది.

పీపుల్స్ మీడియా స్టూడియోలో 'రాజా సాబ్': 'బాహుబలి' సినిమా తర్వాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలు. టిజి విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ సమీపంలోని అజీజ్ నగర్‌లో పీపుల్స్ మీడియా స్టూడియోలో జరుగుతోంది. ప్రభాస్‌తో పాటు ఇతర తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను దర్శకుడు మారుతి చిత్రీకరిస్తున్నారు. చిత్రంలో ప్రభాస్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజరుదత్ తాత పాత్ర పోషిస్తున్నారు. కీలక సన్నివేశాలు మినహా దాదాపుగా సినిమా షూటింగ్‌ను మారుతి పూర్తిచేశారు. డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శంకరపల్లిలో పెద్ది: రామ్‌చరణ్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'పెద్ది'. తొలి సినిమా 'ఉప్పెన'తో(2021) బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా 'పెద్ది'కి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్ సమీపంలోని శంకరపల్లిలో జరుగుతోంది. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల కానుంది.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' నుండి కొత్త అప్‌డేట్..!



ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తను కమిటైన సినిమాలని శరవేగంగా పూర్తి చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హరిహర వీరమల్లు షూటింగ్ పూర్తి చేసి ఇటీవల ఆ చిత్రం విడుదల కూడా చేశారు. ఇక పవన్ నటించిన మరో చిత్రం ఓజీ కూడా షూటింగ్ పూర్తి చేసుకొని రిలీజ్‌కి రెడీగా ఉంది. సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదల కానున్నట్టు తెలుస్తుంది. ఇక పవన్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ మూవీ కూడా సక్సెస్ ఫుల్‌గా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇన్నాళ్లు రాజకీయాల కారణంగా సినిమా షూటింగ్ లను పక్కన పెట్టిన ఆయన ఇప్పుడు వరుసగా కమిట్ అయిన సినిమాలను ఫినిష్ చేస్తున్నారు.కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో మొదలైన ఓ పాట షూటింగ్ తాజాగా ముగిసింది. ఈ షెడ్యూల్ పూర్తవడంతో సినిమాకు సంబంధించిన కీలక దశ పూర్తయినట్టైంది. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శంకర్ పవన్ కళ్యాణ్‌తో దిగిన ఓ పవర్‌ఫుల్ ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇందులో పవన్ కళ్యాణ్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తుండగా, ఈ పిక్ ఎంతగానో ఆకట్టుకుంటుంది. పవన్ గెటప్‌కి ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఈ లుక్‌కి సంబంధించిన క్రెడిట్ హరీష్ శంకర్‌కే ఇవ్వాల్సిందేనంటూ కామెంట్లు వస్తున్నాయి. అయితే మాటిస్తే నిలబెట్టుకోడం , మాట మీదే..నిలబడ్డం, మీరు పక్కనుంటే , కరెంటు పాకినట్టే అంటూ హరీష్ ఇచ్చిన క్యాప్షన్ మరోసారి పవన్‌పై తనకున్న అభిమానాన్ని తెలియజేసింది. పవన్ కళ్యాణ్ ఇచ్చిన సపోర్ట్ వలన ఈ షెడ్యూల్ త్వరగా పూర్తైందని హరీష్ శంకర్ అన్నారు. ఈ రోజుని జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనని తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకి మరింత పవర్ ఇచ్చింది. మాకు సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు అంటూ హరీష్ శంకర్ ట్వీట్ చేశారు. ఇటీవలే హీరోయిన్ రాశీఖన్నా సెట్లో జాయిన్ అయ్యారు. మరో హీరోయిన్ శ్రీలీల పాత్ర కూడా ఇందులో కథానాయికగా నటిస్తుంది. సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా, త్వరలో మరో పాట విడుదల అయ్యే అవకాశం ఉంది. దీనితో హైప్ మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది గ్రాండ్ రిలీజ్‌కి ప్లాన్ అవుతోంది. మరోవైపు ఇటీవల విడుదలైన ఓజీ సినిమా పాటకు వస్తున్న రెస్పాన్స్ కూడా పవన్ ఫ్యాన్స్ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఇది పవన్ కళ్యాణ్ అభిమానులకి ఫెస్టివల్ సీజన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. రాబోయే రోజుల్లో మరిన్ని అప్‌డేట్లు, సర్‌ప్రైజ్‌ల కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు...

# 'దేవర 2' సెట్స్ మీదకి అప్పుడేనా...!



నందమూరి తారక్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దేవర 2' చిత్రంపై ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలువ డింది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ పూర్తికాగానే, 'దేవర 2' సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతు న్నట్లు సమాచారం. దేవర చిత్రం విడుదలై మంచి విజయాన్ని నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ మూవీ పార్ట్ 2కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ప్రస్తుతం దర్శకుడు కొరటాల శివ తీరిక లేకుండా గడుపుతున్నట్లు తెలుస్తుంది. సోషల్ మీడియాలో వైరల్ వస్తున్న వార్తల ప్రకారం 'దేవర 2' షూటిం గ్ వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మొదటిభాగం హిట్ అయిననేపథ్యంలో, రెండో భాగం కూడా అంతే స్థాయిలో అలరిస్తుందని అభిమానులు నమ్మకంతో ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తారక్ కెరీర్‌లోనే మరో మైలురాయిగా నిలవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com